RNI NO Tel / 2012/4241

# హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PA

hyderabadestate.co.in

సంపుటి : 13 | సంచిక : 302 | శుక్రవారం 01 -5-2026 | ఎడిటర్ : బిట్టు లక్ష్మినారాయణ | పేజీలు : 06 | వెల : 5-00


Hyderabad, Vijayawada,vishakaptnam,Tirupathi,Ananthapuram,Guntur,Ongole, Kadapa,Medak Sangareddy,Siddipet, Nalgonda,Karimnagar




## ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల

- 85.25 శాతం ఉత్తీర్ణత నమోదు
- 87.90 శాతం ఉత్తీర్ణతతో బాలిలు టాప్
- 96.07శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా ఫస్ట్
- ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్

2 లో



## మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు


మంగ్లీ సోదరుడి అకౌంట్‌కు డబ్బులు నిందితుడు రమావత్ మధు ట్రాన్స్‌ఫర్ బ్యాంకర్లను వివరాలు కోరిన పోలీసులు

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం



- జవాబుదారీతనం పెంచేందుకే
- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,హైదరాబాద్ ఎస్టేట్ విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు,
ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ



శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవ కలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహిం చేది లేదని సీఎం స్పష్టం చేశారు
.సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబు దారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజ నాలు కాపాడేందుకు



## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్ /అమరావతి,హైదరాబాద్ ఎస్టేట్ తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావ రణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు

- మిగతా 2లో

## పిల్లల దత్తతలో జాగ్రత్తలు తీసుకోవాలి

మంత్రి సీతక్క సూచన



మిగతా 2లో




# పేదల ఇండ్లపై చూపే ఉత్సాహం.. పెద్దల నిర్మాణాలపై ఎందుకు లేదు?

- సల్కం చెరువు కబ్జాపై చర్యలేవి?
- అధికార యంత్రాంగం పనిచేస్తున్నదా?
- ఒవైసీ విద్యాసంస్థల అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎందుకు కండ్లు మూసుకున్నరు?
- ఆ కాలేజీలకు అనుమతులున్నాయా? లేదా?
- ఎంఏయూడీ స్పెషల్ సీఎస్‌తో విచారణ జరుపాలి
- ప్రస్తుతమున్న, రిటైరైన అధికారులనూ వదలొద్దు
- తప్పుచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాల్సిందే
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్
హైదరాబాద్ ఎస్టేట్
హైడ్రా తీసుకుంటున్న చర్యల్లో వివక్ష ఎందుకు చూపుతున్నదని, పేదలుమధ్య తరగతి ఇండ్ల కూల్చివేతలో చూపుతున్న ఉత్సాహం పెద్దల అక్రమ నిర్మాణాల విషయంలో ఎందుకు కనిపించడంలేదని రాష్ట్ర హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు పరిధిలో ఉన్న అంశాల్లో కూడా అనుమతి లేకుండా జోక్యం చేసుకొని కంచెలు వేస్తున్న హైడ్రా.. చెరువులను ఆక్రమించి దశాబ్దాలుగా కొనసాగుతున్న నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీసింది. జీహెచ్ఎంసీ సహా రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టింది. అసలు పరిపాలనా యంత్రాంగం పనిచేస్తున్నదా అంటూ అనుమానం వ్యక్తంచేసింది. సల్కం చెరువు ఆక్రమణలకు



## పశుసంవర్ధక రంగానికి నూతన దిశా నిర్దేశం

- పశుసంవర్ధక మార్గదర్శిని" ఈ
- మేగజైన్‌తో రైతులకు శాస్త్రీయ మార్గనిర్దేశం
- పాడి పశువుల నుంచి కోట్ల ఆర్థిక వృద్ధి
- రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

మిగతా 2లో

అమరావతి,హైదరాబాద్ ఎస్టేట్
రాష్ట్రంలో పశుసంవర్ధక రంగ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే ఉద్దేశంతో "పశు సంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను రాష్ట్ర వ్యవసాయ, పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రారంభించారు.

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రస్తుతం అత్యావశ్యకం వీడ్కోలు సన్మానంలో డిజిపి శివధర్ రెడ్డి కొత్త డిజిపి సివి ఆనంద్‌కు అభినందనలు




హైదరాబాద్,హైదరాబాద్ ఎస్టేట్
రాష్ట్ర డీజీపీ బి. శివధర్‌రెడ్డికి తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనమైన వీడ్కోలు లభించింది. గురువారం ఆయన రిటైర్డ్ అవుతున్న సందర్భంగా పోలీస్ అధికారులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ..32 ఏళ్ల సుదీర్ఘకాలంలో ఎన్నో అనుభవాలు, అనుభూతులు మిగిలాయన్నారు

మిగతా 2లో

## సీతారాం ఆత్మహత్యలో చీకటి కోణం

భార్య అక్రమ సంబంధాలతో తీవ్ర మనోవేదన తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ టెక్కీ సూసైడ్ నోట్ ఆధారంగా వివరాలు వెల్లడి



2లో

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

(మొదటి పేజి (తరువాయి)



కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పె÷-టటెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

హెచ్చరించారు.అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు

వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది.ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, విశాఖ, విజయవాడ, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణలో వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం మాత్రం అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఏపీలోనూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట




. వృత్తిలో భాగంగా పలు సంస్కరణలు తీసుకొచ్చా మన్నా రు. పోలీసింగ్ విధానంలో నేడు అనేక మార్పులు చోటు చేసుకు న్నా యని, యువ పోలీస్ అధికారు లు డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. సర్వీసులో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పదవీ విరమణ పొందిన శివధర్ రెడ్డికి నూతన డీజీపీగా నియామకమైన సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. ఆయన ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొని పలు సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశంసిచారు. తన సూచనలు, సలహాలు తీసుకునేందుకు తాను సిద్ధమేనని సీవీ ఆనంద్ తెలిపారు. 1970, 1980లో పోలీసుల పరిస్థితులు వేరని.. ఇప్పుడు పని చేస్తున్న పోలీస్ సిబ్బంది పరిస్థితులు వేరన్నారు. గతం కంటే ఇప్పుడున్న పోలీసింగ్‌లో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ నడిపించామని తెలిపారు. భవిష్యత్తుకు అనుగుణంగా పోలీస్ శాఖను సిద్ధం చేశామని చెప్పారు. 'నా స్వరాష్ట్రానికి నన్ను డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు. సీఎం ఎన్నో కీలక బాధ్యతలు అప్పగించారు. నేను ఈ స్థాయికి రాడానికి కారణమైన నా గురువులకు ధన్యవాదాలు. యంగ్ పోలీస్ వల్ల పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలి. పోలీస్ పవర్ అంటే గౌరవంగా జీవించడం. సమష్టి కృషి వల్లే ఈ స్థాయిలో ఉన్నాను. నా కుటుంబసభ్యులకు ధన్యవాదాలు.

## పశుసంవర్ధక రంగానికి నూతన దిశా నిర్దేశం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది రైతులు పాడి పశువులు, సన్న జీవాలు, నాటు కోళ్ల పెంపకంతో అనుబంధం కలిగి ఉన్నారని తెలిపారు. 2025--26 సంవత్సరానికి పశుసంవర్ధక శాఖ ద్వారా రూ.1,76,151 కోట్ల స్థూల విలువ వృద్ధి నమోదవడం ఈ రంగ ప్రాధాన్యతను స్పష్టంగా చూపుతోందన్నారు. అయినప్పటికీ సంప్రదాయ యాజమాన్య పద్ధతులు, కూలీల కొరత, పశుగ్రాసాల లోపం, పెరుగుతున్న దాణా ఖర్చులు వంటి సమస్యల కారణంగా ఆశించిన స్థాయి వృద్ధి సాధ్యంకావడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ, అదే సమయంలో పశు సంవర్ధక రంగాన్ని వాణిజ్య సరళిలో అభివృద్ధి చేసుకునే అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. పాడి పశువులు, జీవాలు, నాటు కోళ్లు, పందుల పెంపకం వంటి రంగాల్లో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.విశాఖపట్నంలోని రాష్ట్ర పశుగణ యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల వ్యవస్థాపక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1500 మంది శిక్షణ పొందగా, అందులో సుమారు 200 మంది రైతులు వాణిజ్యపరంగా లాభసాటిగా పశుసంవర్ధక కార్యకలాపాలను విజయవంతంగా ప్రారంభించినట్లు వెల్లడించారు. రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన "పశు సంవర్ధక మార్గదర్శిని" ఈ-మేగజైన్‌ను ఏప్రిల్ నెల నుండి (http://www.apahsmile.in) "స్మైల్" వెబ్‌సైట్‌తో పాటు రిలయన్స్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ మేగజైన్‌లో పశు ఆరోగ్యం, పునరుత్పత్తి, పోషణ, యాజమాన్యం, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై సమగ్ర సమాచారం, విజయగాథలు, నిపుణుల సూచనలు, రైతుల సందేహాలకు సమాధానాలు అందించబడతాయని చెప్పారు. అలాగే, గ్రామీణ స్థాయిలో పనిచేస్తున్న పశు సంవర్ధక సహాయకులు, గోపాల మిత్రులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరవేయడంలో కూడా ఈ-మేగజైన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

పశుసంవర్ధక రంగాన్ని సేంద్రియ, వాణిజ్య పద్ధతుల్లో అభివృద్ధి చేస్తే ఒక్క ఎకరం నుంచి సంవత్సరానికి రూ.5-6 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని మంత్రి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించినట్లుగా ప్రతి ఇంటిలో ఒక ఎంట్రప్రెన్యూర్ ఏర్పడి, వ్యక్తిగత అభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డా.వై. సింహాచలం, జాయింట్ డైరెక్టర్ డా. బైరాగి, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు

హైదరాబాద్,ఏప్రిల్30 తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోన్న మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు కీలక మలుపు తిరిగింది. సింగర్ మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు నిందితుడు రమావత్ మధు నగదు పంపినట్లు పోలీసులు గుర్తించారు. కేసు విచారణలో భాగంగా రమావత్ మధు అకౌంట్‌ను పరిశీలించగా.. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు డబ్బులు పంపినట్లు తేలింది. మూడుసార్లు నగదు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు పడిన రోజే ఖాతా నుంచి విత్ డ్రా చేసినట్లు నిర్ధారించారు. అయితే, ఎంత మేర నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యిందో అధికారులు ఇంకా వెల్లడించలేదు. మరోవైపు రమావత్ మధు అకౌంట్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) సీజ్ చేసింది.

రమావత్ మధు, హిమకాంత్‌రెడ్డి, శివ చౌహాన్‌కు చెందిన అకౌంట్ల పూర్తి వివరాలను ఇవ్వాలని సంబంధిత బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు. మరోవైపు నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఈ కేసులో తమ పేర్లను అనవసరంగా లాగుతున్నారని మంగ్లీ, ఆమె సోదరుడు శివ చౌహాన్ ఆరోపిస్తున్నారు. కాగా, నిందితుడు రమావత్ మధు..

అధిక వడ్డీ పేరుతో వేల మంది నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేశాడని ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు.

## ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల

అమరావతి,ఏప్రిల్30 ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం ఉదయం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫలితాలను ప్రకటించారు. టెన్త్ ఫలితాల్లో 85.25 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 81.14 శాతం ఉత్తీర్ణతతో పోలిస్తే ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చాయి. టెన్త్ ఫలితాల్లో బాలికలు ముందంజలో ఉన్నారు. బాలికలు 87.90 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 82.68 శాతం ఉత్తీర్ణత పొందారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. 72.8 నుంచి 78.39కి ఉత్తీర్ణత శాతం పెరిగింది. వాట్సాప్ 'మన మిత్ర' సేవ ద్వారా 9552300009కు మెజేజ్ పంపి ఫలితాలను తెలుసుకోవచ్చు. టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలియజేశారు. 'మీ కృషి, అంకితభావం ఫలించాయి. కర్నూలు జిల్లా - 71.08,విశాఖపట్నం - 89.51,గుంటూరు - 88.89,తూర్పు గోదావరి - 88.49, కృష్ణా జిల్లా- 88.06, ఎన్టీఆర్ జిల్లా -87.91,నెల్లూరు - 87.37,అనంతపురం - 77.17, చిత్తూరు- 76.69 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం హాజరైన విద్యార్థులు - 6,18,131కాగా, ఉత్తీర్ణులైన విద్యార్థులు - 5,26,954 పాసయ్యారు. రీకౌంటింగ్ / రీ-వెరిఫికేషన్: ఫలితాలపై అసంతృప్తి ఉన్న విద్యార్థులు మే 1 నుంచి మే 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీ-వెరిఫికేషన్‌కు రూ.1,000 ఫీజు చెల్లించాలి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని వారి కోసం మే 25 నుంచి జూన్ 4 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. అపరాధ రుసుము లేకుండా మే 9 వరకు, రూ.50 అపరాధ రుసుముతో మే 10 నుంచి మే 25 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. స్జబెక్టు వారీగా మార్కుల మెమోలు నాలుగు రోజుల్లో అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

## సీతారాం ఆత్మహత్యలో చీకటి కోణం

హైదరాబాద్,ఏప్రిల్30: రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో కలకలం సృష్టించిన టెకీ సీతారాం ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో సీతారాం రాసిన 19 పేజీల సూసైడ్ నోట్ బయటకు రావడంతో ఆత్మహత్యకు గల కారణాలు తెలిశాయి. భార్య ఇతరులతో శారీరక సంబంధాలతో విసిగిపోయి సీతారాం ఆత్మహత్య చేసుకున్నట్టు నోట్ ద్వారా వెల్లడించాడు. తను వద్దని చెప్పినా వినలేదని సీతారాం పేర్కొన్నాడు. ఏపీలోని మార్కాపురానికి చెందిన సీతారాం, నంద్యాలకు చెందిన రేణుకకు 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సీతారాం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సీతారాం కుటుంబం బాచుపల్లిలో స్థిరపడింది.

అయితే రేణుక తన భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకొని, ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ దారుణాలు చూడలేక భర్త సీతారం హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకున్న రేణుక రమణారెడ్డి అనే వ్యక్తితో కలిసినప్పుడు ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ వీడియోలను రమణారెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా.. తన భార్య నిజ స్వరూపం తెలిసిన సీతారాం ఫిబ్రవరి నెలలో 19 పేజీల సూసైడ్ లేఖ రాసి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

## పిల్లల దత్తతలో జాగ్రత్తలు తీసుకోవాలి

హైదరాబాద్,ఏప్రిల్30 పిల్లల దత్తత విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. దత్తత కావాలనుకున్న వారు ఐసీడీసీని సంప్రదించాలని సూచించారు. శుక్రవారం కాచిగూడ బస్ టెర్మినల్‌లో అమ్మఒడి తల్లిపాల ఫీడింగ్ కేంద్రాన్ని, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పిల్లల దత్తత కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. సమ్మక్క - సారలమ్మ జాతరలో పిల్లల తల్లులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, జన సమూహ ప్రాంతాల్లో, బస్సు టెర్మినల్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో తల్లిపాల ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు.

## పేదల ఇండ్లపై చూపే ఉత్సాహం.. పెద్దల నిర్మాణాలపై ఎందుకు లేదు?

గురవుతుంటే, అక్కడ అక్రమ నిర్మాణాలు వెలుస్తుంటే హైడ్రా ఏం చేస్తున్నదని నిప్పులు చెరిగింది. ఇందుకు బాధ్యులైన వారిపై, వారు ఉద్యోగ విరమణ చేసినా సరే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

అనుమతులున్నాయా లేదా అన్నది చూడలేదు

హైదరాబాద్, చాంద్రాయణగుట్టలోని సల్కం చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ఒవైసీ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ విజయ్‌గోపాల్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. సల్కం చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్, సలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అంశంపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 2014 నుంచి నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు ఎందుకు కండ్లు మూసుకున్నారో జవాబు చెప్పాలని నిలదీసింది. ఈ నిర్మాణాలకు అనుమతులున్నాయా లేదా అన్నది కూడా అధికారులు పరిశీలించకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. పలుమార్లు ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోకపోవడం, పర్యావరణానికి నష్టం జరుగుతున్నా స్పందించకపోవడం ఏమిటని మండిపడింది. ఈ విషయంలో హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోలేదో స్పష్టత ఇవ్వాలని నిలదీసింది.

హైడ్రా వైఖరిలో వివక్ష

అక్రమ నిర్మాణాల తొలగింపులో హైడ్రా వైఖరిలో స్పష్టమైన వివక్ష కనిపిస్తున్నదని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చెరువులు, రహదారులు, ఫుట్‌పాత్‌లు, రైల్వే లైన్లకు సంబంధించిన ఆక్రమణలను తప్పనిసరిగా తొలగించాలనే స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు అమలు చేయలేదని నిలదీసింది. ఒవైసీ నిర్మాణాలకు సంబంధించి ప్రారంభం నుంచి ఇప్పటివరకు బాధ్యత వహించిన అన్ని శాఖల అధికారులపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఉద్యోగ విరమణ చేసిన వారినైనా విడిచిపెట్టకుండా బాధ్యులను చేయాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి సూచించింది. ఎంఏయూడీ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఆధ్వర్యంలో విచారణ జరిపి, ఎవరు తప్పు చేశారో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

# దత్తతకు చట్టబద్ధ మార్గమే అనుసరించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ సూచన




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 30:-
రంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పిల్లలను దత్తత తీసుకునే వారు తప్పనిసరిగా చట్టబద్ధ విధానాన్ని మాత్రమే అనుసరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కొమ్మిశెట్టి స్పష్టం చేశారు. కేంద్ర దత్తత వనరుల సంస్థ పోర్టల్ ద్వారా మాత్రమే దత్తత ప్రక్రియ చేపట్టాలని ఆమె తెలిపారు. ఇతర మార్గాలను అనుసరించడం వల్ల భవిష్యత్తులో అనవసరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరించారు.ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన బాల సంక్షేమ కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో దత్తతకు సంబంధించిన చట్టబద్ధ విధానాలు, అక్రమ దత్తతలు, తాత్కాలిక సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత మాట్లాడుతూ, జిల్లాలో దత్తతపై సరైన అవగాహన లేకపోవడం వల్ల కొందరు త్వరితగతిన పిల్లలను దత్తత తీసుకోవాలనే ఉద్దేశంతో తప్పు మార్గాలను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ చట్టబద్ధ దత్తత విధానాన్నే అనుసరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బాల సంక్షేమ కమిటీ సభ్యురాలు డా. రమాదేవి, "వేర్ ఆర్ ఇండియాస్ చిల్డ్రెన్" స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సంతోష్, ప్రేమలత పాల్గొని దత్తత యొక్క ప్రాముఖ్యత, దత్తత ప్రక్రియ, దాని ద్వారా కలిగే ప్రయోజనాలు మరియు బాధ్యతలపై వివరించారు. దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు వీడియో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.
దత్తతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సమావేశ మందిరం సమీపంలో ఏర్పాటు చేసిన దత్తత సహాయ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. అలాగే దత్తత విధానంపై రూపొందించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కొమ్మిశెట్టి, జిల్లా సంక్షేమ మరియు గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా బాల సంక్షేమ కమిటీ సభ్యులు, జిల్లా బాలల సంరక్షణ అధికారి ప్రవీణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, దత్తత కోసం దరఖాస్తు చేసిన తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


# దేశ ఐక్యతే లక్ష్యం, కాంగ్రెస్ కార్యకర్తల బాధ్యతను గుర్తుచేసిన మంకాల దాసు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 30:-
హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శిక్షణ శిబిరం ముగింపు దశకు చేరుకుంది. మూడు రోజులుగా సాగిన ఈ శిబిరంలో రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షులు మంకాల దాసు పాల్గొని కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు.ఈ సందర్భంగా మంకాల దాసు మాట్లాడుతూ, దేశ ఐక్యత, సామరస్య భావన ప్రతి వ్యక్తిలో పెంపొందించడం కాంగ్రెస్ కార్యకర్తల ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. "భిన్నత్వంలో ఏకత్వం భారతదేశం యొక్క అసలు బలం" అని ఆయన అన్నారు. దేశంలోని భాష, మతం, ప్రాంతాల వైవిధ్యాన్ని గౌరవిస్తూ అందరినీ సమానంగా చూడటం ప్రతి కార్యకర్త కర్తవ్యమని స్పష్టం చేశారు.
ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న కార్యకర్తలకు నాయకత్వ లక్షణాలు, సేవా కార్యక్రమాల నిర్వహణ పద్ధతులు, గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలతో అనుసంధానం ఎలా పెంపొందించుకోవాలి అనే అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం, యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం వంటి అంశాలను వివరించారు.అదేవిధంగా ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొందించడం, ఐక్యత, సామరస్యాన్ని ప్రోత్సహించడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతంగా మంకాల దాసు పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రతి వ్యక్తి చట్టాలను గౌరవించడం, ప్రజా ఆస్తులను కాపాడటం వంటి బాధ్యతలను కార్యకర్తలు ప్రజల్లో బలంగా చాటాలని సూచించారు.
ఈ శిబిరం ద్వారా కార్యకర్తలకు గ్రాస్‌రూట్ స్థాయిలో పని చేయడానికి అవసరమైన అనుభవం దిశానిర్దేశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు దుమ్మురేపిన ఫలితాలు

## ఎస్ ఎస్ సి ఫలితాల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన ప్రభుత్వ పాఠశాలలు





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతిని ధి, ఏప్రిల్ 30:-ఎస్ ఎస్ సి మార్చి 2026 పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మరోసారి తమ సామర్థ్యాన్ని నిరూపించారు. ఈసారి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఆధిపత్యం చెలాయించడం విశేషం. మొత్తం 568 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం గమనార్హం. జిల్లా స్థాయిలో టాప్ ర్యాంకుల విషయంలో కూడా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ముందంజలో నిలిచారు. కేశంపేట మండలానికి చెందిన అమీనా, రాజేంద్రనగర్ మండలం మైలార్దేవ్ పల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన నవ్య శ్రీ ఇద్దరూ 581 మార్కులతో సంయుక్తంగా జిల్లా మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరి విజయం విద్యా వర్గాల్లో హర్షం కలిగించింది. అదేవిధంగా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం తొర్రూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన చరణ్ 580 మార్కులతో ద్వితీయ స్థానం సాధించగా, కొంగర రావిర్యాల గ్రామానికి చెందిన త్రినేత్ర 579 మార్కులతో తృతీయ స్థానం దక్కించుకున్నారు. ఇక ఇబ్రహీంపట్నం ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన వైష్ణవి 575 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచి ప్రతిభ చాటుకున్నారు. ఈ ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, తల్లిదండ్రుల సహకారం కలిసొచ్చి ఈ విజయానికి కారణమయ్యాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన ఫలితాలు రావడం విద్యా రంగంలో సానుకూల మార్పులకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఐ

# మంచాల మండలం పదవ తరగతి టాపర్‌గా ఇంద్రోజు శివసాయి


## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఘన విజయం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 30:-
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ (ప్రైవేట్) విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాల మొత్తం 91.60 శాతం ఉత్తీర్ణత సాధించి విశేష ఫలితాలు నమోదు చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ గిరిధర్ ఆనందం వ్యక్తం చేశారు.ఈ ఫలితాల్లో 551 మార్కులతో ఇంద్రోజు శివసాయి మండల టాపర్‌గా నిలిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. అతని కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కలిసి ఈ విజయాన్ని సాధించాయని పాఠశాల వర్గాలు తెలిపాయి. అదే విధంగా 526 మార్కులతో కే. వైష్ణవి ద్వితీయ స్థానం, 503 మార్కులతో లక్ష్మీ ఐశ్వర్య తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులందరూ కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ ఏడాది పాఠశాలలో మొత్తం 154 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందులో 141 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులలో 64 మంది బాలికలు, 77 మంది బాలురు ఉన్నట్లు ప్రిన్సిపల్ వివరించారు. విద్యార్థుల విజయానికి కారణమైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించిన ప్రిన్సిపల్, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు పాఠశాల కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా టాపర్ విద్యార్థి శివసాయి, ఇతర ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించనున్నట్లు వెల్లడించారు.

# తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ( ఈసీఐ ) అధికారిక ఆమోదం



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి ఏప్రిల్ 30:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో.. టిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ... ?తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో నేడు ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. సామాజిక తెలంగాణ సాధనే ఏకైక ధ్యేయంగా మనం స్థాపించుకున్న 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారికంగా ఆమోదముద్ర వేసిందని తెలియజేయడానికి నేను ఎంతో గర్విస్తున్నామని టిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి మేడ్చల్ రామిడి వెంకట్ రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి అన్నారు మేడ్చల్ లోని అద్వయ కన్వెన్షన్ లో జరిగిన సభలో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావాన్ని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవితమ్మ ప్రకటించిన విషయం విదితమే. నాటి ఆ ప్రకటనకు నేడు చట్టబద్ధత లభించింది. ఈరోజు బంజారాహిల్స్ లోని కవితమ్మ నివాసంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు స్వయంగా విచ్చేసి, పార్టీకి ఆమోదం తెలుపుతూ అధికారిక లేఖను.అందజేశారు. ఇది తెలంగాణ ప్రజానీకం ఆకాంక్షలకు దక్కిన తొలి విజయం.?సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ "పాంచజన్యం" పేరుతో ఐదు ప్రధాన అంశాలతో ముందుకు వెళుతుంది:? కేజీ నుంచి పీజీ వరకు ప్రతి బిడ్డకూ నాణ్యమైన ఉచిత విద్య.?పేదలందరికీ కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలు.?అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్, వ్యవసాయానికి పూర్తిస్థాయి మద్దతు.?సింగిల్ నోటిఫికేషన్ ద్వారా 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మరియు యువతకు రూ. 2 లక్షల నుండి రూ. 20 కోట్ల వరకు స్వయం ఉపాధి రుణాలు.?అన్ని వర్గాలకు సమన్యాయం, రాజకీయ పాలనలో సమాన ప్రాధాన్యత.?ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ఆమోదం తెలిపిన కేంద్ర ఎన్నికల సంఘానికి వారు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల గొంతుకను వినిపించేందుకు, వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు పుట్టిన ఈ 'టీఆర్ఎస్' పార్టీ తెలంగాణ భవిష్యత్తును పునర్నిర్మిస్తుందని రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కప్పటి పాండురంగారెడ్డి అన్నారు

# ఇబ్రహీంపట్నం స్వయంభు లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవ వైభవం

## స్వామివారి కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 30:-
ఇబ్రహీంపట్నం, ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడింది. స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం ఈసారి అత్యంత వైభవంగా, భక్తి పారవశ్యంతో నిర్వహించబడింది. దాదాపు 75 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయ ఉత్సవం స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల భక్తులను విశేషంగా ఆకర్షించింది.
ఆలయ ప్రాంగణం మంగళ వాద్యాలు, వేద మంత్రోచ్చారణలతో పవిత్ర వాతావరణాన్ని సంతరించుకుంది. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను అద్భుతంగా అలంకరించి, శాస్త్రోక్తంగా వివాహ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు మంగళహారతులు పట్టి, పురుషులు భక్తి గీతాలు ఆలపిస్తూ ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని ప్రదర్శించారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది.ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ పట్టు వస్త్రాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. దేవాలయ సంప్రదాయాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఇటువంటి పుణ్య కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.
స్థానికులు మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించడంలో ఇవి ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

# పేదరికాన్ని జయించిన ప్రతిభ, జిల్లాలో రెండో స్థానం సాధించిన తొర్రూరు విద్యార్థి చరణ్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 30:-
రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్ మండలం:
తొర్రూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సునిగంటి చరణ్ పదవ తరగతి ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాలోనే రెండవ స్థానాన్ని సాధించడం స్థానికంగా హర్షం వ్యక్తం అయ్యేలా చేసింది. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో చరణ్ 580 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన చరణ్ తండ్రి సునిగంటి రమేష్ కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇలాంటి కష్టసాధ్య పరిస్థితుల్లోనూ తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ, వారికి మంచి భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద కుమారుడైన చరణ్ సాధించిన విజయంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చరణ్ విజయాన్ని గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇంతటి ప్రతిభ కనబరచడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చరణ్‌కు ఆశీస్సులు అందించారు. చరణ్ విజయానికి గురువుల ప్రోత్సాహం, క్రమశిక్షణతో చదివే అలవాటు ప్రధాన కారణమని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఇలాంటి విద్యార్థులు మరెందరికో ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.
గ్రామంలో సాధారణ కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థి ఈ స్థాయి విజయాన్ని సాధించడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా మారింది.

# ఇబ్రహీంపట్నంలో మే 24న వికలాంగుల హక్కుల జిల్లా సదస్సు

## ఉపాధి హామీ పథకంలో 150 రోజుల పని కల్పించాలని డిమాండ్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 30:-ఇబ్రహీంపట్నం, వికలాంగుల చట్టాలు, సంక్షేమ పథకాల అమలు, సమస్యల పరిష్కారం అంశాలపై మే 24న ఇబ్రహీంపట్నంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య తెలిపారు. ఈ సదస్సులో వికలాంగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన, రాష్ట్రంలో వికలాంగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నప్పటికీ, వారికి అవసరమైన సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, ముఖ్యంగా చెవిటి, అంధుల కోసం తగిన విద్యాసంస్థలు లేవని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వికలాంగుల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతుండటంతో సమాన అవకాశాలు దక్కడం లేదని తెలిపారు. సంక్షేమ పథకాలు సరిగా అందకపోవడం, స్వయం ఉపాధి అవకాశాల లేమి కారణంగా వికలాంగుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయక పరికరాలు కూడా అందరికీ చేరడం లేదని పేర్కొన్నారు. వికలాంగులపై వేధింపులు, మహిళలపై లైంగిక దాడులు వంటి ఘటనలు పెరుగుతున్నప్పటికీ వాటిని అరికట్టడంలో



ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కాలుష్యం కారణంగా వికలాంగుల సంఖ్య పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని గ్రామాల్లో మే 1 నుండి 10 వరకు వికలాంగుల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సర్వేలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సర్వేలో సంక్షేమ పథకాల అమలు, విద్య, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి రుణాలు, సహాయక పరికరాల పంపిణీ, కుటుంబ సమస్యలు, మహిళలపై వేధింపులు, ప్రభుత్వ పథకాలలో రిజర్వేషన్ల అమలు వంటి అంశాలను అధ్యయనం చేయనున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకంలో వికలాంగులకు కనీసం 150 రోజుల పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. సదస్సుకు జిల్లాలోని వికలాంగులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు, కమిటీ సభ్యులు మొఘదటి ప్రమోద్ కుమార్, బస్సు పాండురంగారెడ్డి, కార్యకర్తలు విజయ్, ఎల్లయ్య, రమేష్, దానయ్య, సత్తయ్య, నర్సింహా, కృష్ణకాంత్, నాగరాజు, శివాని, అరేగి బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ అకాడమీ ఆర్ట్స్ ఆఫ్ లైఫ్ 2026 సమ్మర్ క్యాంపు



హైదరాబాద్ ఎస్టేట్ మంచిర్యాల మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని సమీక్ష ఆర్ట్స్ అకాడమీ ఆర్ట్స్ ఆఫ్ లైఫ్ 2026 సమ్మర్ క్యాంపు ఈరోజు ఉదయం అల్ఫాన్స్ కాన్వెంట్ హై స్కూల్ ఉదయం సిస్టర్ బ్లేస్సి మరియు మాలకొండయ్య అదేవిధంగాింగరేణి ఆర్కేపి ఓ ఏ క్లబ్బులో పి రఘునాథరెడ్డి డిసిసి అధ్యక్షులు పల్లె రాజు రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ వడ్ల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుర్కల విక్రం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చేతుల మీదుగా సమీక్ష ఆర్ట్స్ అకాడమీఆర్ట్స్ ఆఫ్ లైఫ్ 2026 సమ్మర్ క్యాంపు ఓపెనింగ్ సెర్మనీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటి రోజే 40 మంది చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొనడం జరిగినది. సమీక్ష యాడ్స్ అకాడమీ చైర్పర్సన్ మెర్సీ రాణి మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపు రామకృష్ణాపూర్ పట్టణ ప్రజలకే కాక హాలిడేస్ వచ్చిన పిల్లలకి మరియు ఉమెన్స్ కి కూడా ఆహ్వానాన్ని తెలియజేశారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని అన్ని స్కూల్ లోకి కూడా ఆహ్వానాన్ని తెలియజేశారు. అదేవిధంగా ఒక కల నేర్చుకోవాలి అంటే 500 రూపాయలు అన్ని కళలు నేర్చుకోవాలి అంటే 1500 వీటితోపాటు పిల్లలందరికీ 31 రోజు శిక్షణ తర్వాత సర్టిఫికెట్ మెడల్ మెమొంటో అందజేయడం జరుగుతుంది. ఈ క్యాంపు మే 31 తారీకు వరకు ఉదయం సాయంత్రం జరుగుతుంది. అని తెలియజేశారు. మరియు ఈ పిల్లలను రాష్ట్రస్థాయి పోటీలకు కూడా తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఈ సమ్మర్ క్యాంపు ని వినియోగించుకోగలరని తెలియజేశారు. కార్యక్రమంలో సమీక్ష యాడ్స్ అకాడమీ మాస్టర్స్ అందరూ కూడా పాల్గొన్నారు. మరియు విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు మీడియా మిత్రులు పత్రిక విలేకరులు పలువురు పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారందరికీ సమీక్ష యాడ్స్ అకాడమీ చైర్పర్సన్ మెర్సీ రాణి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# విహెచ్ కు అభినందన సత్కారం




కాచిగూడ, ఏప్రిల్ 30: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు బీసీ సంక్షేమ శాఖకు మంత్రి హోదాతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన సందర్భంగా జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, బర్కత్ పుర మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు గురువారం ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# టెన్త్ ఫలితాల్లో సత్తా చాటిన బిసి గురుకులాలు

- 96.02 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు
- అభినందనలు తెలిపిన మంత్రి సవిత



అమరావతి,ఏప్రిల్30 ఆంధ్రప్రదేశ్ పదో తరగతి ఫలితాల్లో ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలు మరో సారి తమ ప్రతిభను చాటుకు న్నా యి. ఈసారి 96.02 శాతం ఉత్తీ్ణ్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచాయి. ప్రభుత్వ పరిధిలో విద్యార్థుల సంఖ్యాపరంగా ఉన్న గురుకులాల్లో ఎంజేపీ సంస్థలు అగ్రస్థానంలో నిలవడం విశేషం. విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించేలా, నరవాడ ఎంజేపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు 596, 593 మార్కులు సాధించి విశిష్ట ఫలితాలు నమోదు చేశారు. మొత్తం 100 పాఠశాలల్లో 30 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం ఈ సంస్థల విద్యా ప్రమాణాలను మరోసారి నిరూపించింది. ఈ అద్భుత విజయంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది కృషి ఫలితంగానే ఈ మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. బీసీ విద్యార్థుల విద్యోన్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయని అన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న ప్రోత్సాహక చర్యల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని, బీసీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల తరపున వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంజేపీ బీసీ గురుకులాల ఈ విజయంతో ప్రభుత్వ విద్యా సంస్థలపై విశ్వాసం మరింత పెరిగిందన్నారు మంత్రి సవిత.. కాగా, ఈ ఏడాది 6,18,131 మంది టెన్త్ పరీక్షలు రాయగా.. 5,26,9654 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.. అంటే 85.25 శాతం ఉత్తీర్ణత సాధించారు.. బాలురు 82.68 శాతం పాస్ అయితే.. బాలికలు 87.9 శాతం పాస్ అయ్యి మరోసారి సత్తా చాటారు.. ఇక, అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు మే 25 నుంచి ప్రారంభమై జూన్ 4 వరకు కొనసాగనున్నాయి. ఈ పరీక్షల ద్వారా విద్యార్థులు తమ విద్యను కొనసాగించేందుకు మరో అవకాశం లభిస్తుంది. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మే 1 నుంచి మే 9 వరకు పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. నిర్దిష్ట గడువులోపు ఫీజు చెల్లించడం తప్పనిసరి అని అధికారులు సూచించారు. ఇక, ఫలితాలపై సందేహాలు ఉన్న విద్యార్థులకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం కూడా అవకాశం కల్పించారు. మే 1 నుంచి మే 7 వరకు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సరైన ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలని అధికారులు సూచిస్తున్నారు.

# కారంపూడి నగల దోపిడీ

## పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

కారంపూడ,ఏప్రిల్30 కారంపూడిలో పట్టపగలే దాడి చేసి బంగారు నగలు చోరీ చేసిన కేసులో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎప్రిల్ 27న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో బంగారు నగలు దుకాణాలకు అందించేందుకు వినుకొండకు చెందిన యక్కల శ్రీనివాసరావు కారంపూడి వచ్చారు. అతడిపై నలుగురు వ్యక్తులు దాడి చేసి రూ.కోటి విలువ చేసే ఆభరణాల సంచిని లాక్కెళ్లిన విషయం తెలిసిందే. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో ఐదు బృందాలను నియమించి విచారణ చేపట్టారు. వినుకొండలో శ్రీనివాసరావు ఇంటి నుంచి బయలుదేరిన దగ్గర నుంచి చోరీ జరిగి, దుండగులు పారిపోయే మార్గాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఘటన జరిగిన ముందురోజు నిందితులు కారంపూడిలోని పలు ప్రాంతాల్ని పరిశీలించినట్లు సీసీ ఫుటేజీలో గుర్తించారు. నిందితుల్లో ఒకరు గాంధీబొమ్మ సెంటర్లోని ఓ దుకాణంలో శీతల పానీయం తాగి ఫోన్‌పే చేశాడు. అతడి ఫోన్ నంబరు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వీరికి వినుకొండ, కారంపూడి, పిడుగురాళ్లలో కొందరు సహకరించినట్లు గుర్తించి, వారి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. సాంకేతికత ఆధారాలతో నిందితుల్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# ఎసిబికి చిక్కిన లంచగొండి అధికారి

భద్రాద్రి కొత్తగూడెం,ఏప్రిల్30 జిల్లాలోని ఓ ఫారెస్టు బీట్ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. జిల్లాలోని గుండాల ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నడిమిగూడెం ఫారెస్టు బీట్ అధికారి బానోత్ నరేష్‌ను గురువారం రూ.10 వేలు లంచం తీసుకుంటుం డగా పట్టుకున్నారు. తన తండ్రికి ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల పోడు భూముల్లో అటవీ అధికారులు జోక్యం చేసుకోవద్దని కోరగా బీట్ అధికారి లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించి బీట్ అధికారిని పట్టుకుని వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

# కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

## ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం- టీఆర్ఎస్ రాసిపెట్టి ఉందంటూ కవిత పోస్ట్



హైదరాబాద్,ఏప్రిల్30 'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణెలి ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

# కొత్త అక్రెడిటేషన్లు వచ్చే వరకు... పాత కార్డుల గడువు పొడిగించాలి

## టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



హైదరాబాద్, ఏప్రిల్ 30: రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల పాత అక్రెడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తున్నందున కొత్త అక్రెడిటేషన్ కార్డులు జారీ అయ్యేంత వరకు పాత కార్డులు చెల్లుబాటు అయ్యే విధంగా కనీసం నెల రోజులకు పొడిగించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాత అక్రెడిటెషన్ కార్డుల చెల్లుబాటు గడువైతే ముగిసింది కానీ కొత్త కార్డులు మాత్రం ఇంతవరకు జారీ చేయలేదని, ఆరంభ శూరత్వంగా గురువారం హైదరాబాద్ లోమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొద్ది మంది జర్నలిస్టులకు మాత్రమే అందజేశారని, అంతే తప్ప రాష్ట్ర స్థాయిలో గానీ, జిల్లా, మండల స్థాయిలో గానీ ఇంకెవరికీ కార్డులివ్వలేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు కూడా ఇంతవరకు కార్డులివ్వలేదని, ఈ ప్రక్రియలో ఏర్పడిన గందరగోళం కారణంగా చాలా మంది జర్నలిస్టులు నేటికీ దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. కొత్త కార్డులు రాకముందే పాత కార్డుల చెల్లుబాటును నిలిపివేయడం సరైంది కాదని, దీనివల్ల జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతాయని,ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం, ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మే ఒకటి నుంచి 10వ తేదీ మధ్య అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలంటూ ఐఅండ్ పీఆర్ కొత్త కమీషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం అభినందనీయమని, అయితే కొత్త కార్డులు వచ్చేంత వరకు పాత కార్డులు చెల్లుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని మామిడి సోమయ్య కోరారు.

# నా సక్సెస్ సీక్రెట్ ఇదే!



ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న అభిషేక్, తన అద్భుతమైన ఫామ్ వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించాడు. ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు, తన టీమ్ మేట్ ట్రావిస్ హెడ్ ప్రభావం తన బ్యాటింగ్ శైలిపై చాలా ఎక్కువగా ఉందని అభిషేక్ పేర్కొన్నాడు. జియో స్టార్ తో జరిగిన సంభాషణలో అభిషేక్ తన మనసులోని మాటలను పంచుకున్నాడు. హెడ్ తన బ్యాటింగ్ అప్రోచ్ ను ఎలా మార్చాడో, మైదానంలో భయం లేకుండా ఎలా ఆడాలో నేర్పించాడో వివరించాడు. ట్రావిస్ హెడ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి రాకముందు నుండే తాను అతని ఆటను గమనిస్తున్నానని, దాదాపు ఏడాదిన్నర కాలంగా అతని బ్యాటింగ్ స్టైల్ తనను ఆకట్టుకుందని అభిషేక్ తెలిపాడు. అతను తన టీమ్ మేట్ అయినప్పుడు తాను చాలా సంతోషించానని, అతనితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ఒక గొప్ప అనుభవమని వెల్లడించాడు. అతనితో మాట్లాడినప్పుడు మొదట అడిగింది అతని బ్యాటింగ్ మైండ్‌సెట్ గురించేనని, మూడు ఫార్మాట్లలోనూ అతను బౌలర్లపై ఎలా ఆధిపత్యం చెలాయిస్తాడో తెలుసుకోవాలని అనుకున్నానని అభిషేక్ చెప్పాడు. బ్యాటింగ్ విషయంలో ట్రావిస్ హెడ్ చాలా సింపుల్ ప్లాన్ ఫాలో అవుతాడని అభిషేక్ తెలిపాడు. "బంతిని జాగ్రత్తగా గమనించు, మొదటి బంతి నుండే బాదగలనని నీకు అనిపిస్తే ఏమాత్రం ఆలోచించకుండా షాట్ ఆడేయ్ అని హెడ్ నాకు సలహా ఇచ్చాడు. ఐపీఎల్ ప్రాక్టీస్ సెషన్లలో నేను అదే ఫాలో అయ్యాను. ఇప్పుడు నా మైండ్‌సెట్ పూర్తిగా మారిపోయింది. బంతి నా జోన్ లో పడితే చాలు, మొదటి బంతి నుండే సిక్సర్ బాదడానికి ప్రయత్నిస్తున్నాను. ఈ అగ్రెసివ్ అప్రోచ్ వల్లే నేను పవర్ ప్లేలో ఎక్కువ రన్స్ చేయగలుగుతున్నాను" అని ఈ యంగ్ సెన్సేషన్ వివరించాడు. ప్రపంచంలోనే ఐపీఎల్ నంబర్ వన్ టీ20 లీగ్ అని అభిషేక్ కొనియాడాడు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దిగ్గజ ఆటగాళ్లతో కలిసి ఆడటం ఒక వరం లాంటిదని అభిప్రాయపడ్డాడు. ప్రతి ఐపీఎల్ సీజన్‌ను తానొక పాఠంలా భావిస్తానని, అగ్రశ్రేణి ఆటగాళ్లతో పోటీ పడటం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చని చెప్పాడు.

# ప్లేఆఫ్ రేసు నుంచి ముంబై అవుట్?



ఐపీఎల్ 2026 చాలా ఇంట్రస్టింగ్‌గా సాగుతోంది. బుధవారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన 41వ హైఓల్టేజ్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించింది. ఆరు వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. సొంత గడ్డపై ముంబై ఇండియన్స్‌కు నిరాశ తప్పలేదు. భారీ స్కోరు సాధించినప్పటికీ మ్యాచ్‌ను గెలవలేకపోయింది. వరుస పరాజయాలతో పాయింట్ల పట్టికలో ముంబై ఇండియన్స్ 9వ స్థానానికి పడిపోయి ప్లేఆఫ్ అవకాశాలను క్లిష్టతరం చేసుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 243 పరుగులు చేసింది. ఆ జట్టులో ర్యాన్ రికెల్టన్ వీరవిహారం చేశాడు. 123 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన దిగ్గజాలకు సాధ్యం కాని రికార్డును నమోదు చేశాడు. దీంతో కేవలం ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి 244 పరుగుల లక్ష్యాన్ని ఎస్ఆర్‌హెచ్‌కు ఇచ్చింది. భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో హైదరాబాద్ తడబడుతుందని ముంబై భావించింది. కానీ ట్రావిన్స్ హెడ్, అభిషేక్ శర్మ తమ మార్క్ ఆరంభాన్ని అందించారు. ముఖ్యంగా హెడ్ అయితే సిక్సర్స్‌తో ముంబై బౌలర్లను ఊచకోత కోశాడు. వరుస ఓవర్లలో వికెట్లు పడినా హైదరాబాద్ ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఆరంభాన్ని క్యాష్ చేసుకున్న హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా మిగతా పని పూర్తి చేశారు. ఇంకా 8 బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో ముంబైని ఓడించారు. ఈ మ్యాచ్ హైదరాబాద్‌ను పాయింట్ల పట్టికలో మెరుగు పరిస్తే, ముంబైను 9వ స్థానంలో పడేసింది. ముంబై ఓటమికి ప్రధానంగా బౌలింగ్ వైఫల్యం, కెప్టెన్ హార్దిక్ పాండ్యా తీసుకున్న కొన్ని నిర్ణయాలు, క్యాచ్‌లు పట్టకపోవడం. కీలక సమయంలో ఒక డీఆర్ఎస్ విషయంలో పాండ్యా చేసిన పొరపాటు ముంబైకి విజయాన్ని దూరం చేసింది. దీంతో హెడ్ దూకుడుగా ఆడి స్కోర్‌బోర్డు పరుగులు పెట్టించాడు. అతని క్యాచ్‌లను కూడా మూడుసార్లు జారవిడిచారు. ముంబైకి ప్లే ఆఫ్ ఆశలు లేనట్టేనా అంటే చెప్పలేదు. ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన ముంబై కేవలం రెండు మాత్రమే గెలిచింది. ఆ జట్టుకు కేవలం నాలుగు పాయింట్లు మాత్రమే ఉన్నాయి. టోర్నీలో ప్లేఆఫ్‌కు వెళ్లాలంటే మిగితా ఆరు మ్యాచ్‌లలో కచ్చితంగా అన్నీ గెలవాలి. 12 ఇప్పుడు నాలుగు మొత్తం 16 పాయింట్లో ప్లేఆఫ్ బెర్తు ఖరారు చేసుకోవచ్చు. ఒకవేళ ఆరింటిలో ఐదు మ్యాచ్‌లు గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 14 పాయింట్లు ఉంటాయి. అప్పుడు ితర జట్ల ఫలితాలు, నెట్ రన్ రేట్‌పై ఆధారపడాలి. మరో రెండు మ్యాచ్‌లలో ఓడిపోతే ఈ ఏడాదికి గుడ్‌బై చెప్పేసి వచ్చే సీజన్ కోసం ప్లాన్స్ వేసుకోవాల్సి ఉంటుంది. ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్ ఆశలను సజీవంగా ఉండాలి అంటే మే రెండున చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో తప్పక గెలవాలి.

# సన్ రైజర్స్ నయా సంచలనం సలీల్ అరోరా





ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుస విజయాలతో దూసుకుపోతుంది. బుధవారం వాంఖడే వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 244 పరుగుల లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ మ్యాచ్‌లో సన్ రైజర్స్ నయా సంచలనం సలీల్ అరోరా ఆఖరిలో వేగంగా ఆడి హైదరాబాద్ విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు అదరగొట్టే ఆటగాడు సలీల్ అరోరా దొరికాడు. వేలంలో రూ. 1.5 కోట్లకు కొనుగోలు చేసినప్పుడు అనేక అనుమానాలు వ్యక్తమైన ఈ అన్‌క్యాప్డ్ వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్.. ఇప్పుడు తన ప్రదర్శనతో అందరికీ సమాధానం ఇచ్చాడు. ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌పై జరిగిన హై స్కోరింగ్ మ్యాచ్‌లో తన అద్భుత ఫినిషింగ్ ఇన్నింగ్స్‌తో జట్టుకు భారీ విజయాన్ని అందించాడు. సీజన్ ప్రారంభంలో వరుసగా తక్కువ స్కోర్‌తో ఔట్ కావడం వల్ల సలీల్ అరోరాపై పలు విమర్శలు వచ్చాయి. అయితే ముంబై ఇండియన్స్‌తో జరిగిన 244 పరుగుల భారీ ఛేజ్‌లో ఈ యువ క్రికెటర్ తన సత్తా ఏంటో బయటపెట్టాడు. ఛేజింగ్‌లో 17వ ఓవర్లో నితీశ్ కుమార్ రెడ్డి ఔటైన తరువాత క్రీజులోకి వచ్చిన ఈ ఆటగాడు విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. కేవలం 10 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 30 పరుగులతో అజేయంగా నిలిచాడు. ముఖ్యంగా స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో అతడు కొట్టిన సిక్సర్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. చివరి 18 బంతుల్లో 24 పరుగులు అవసరమైన సమయంలో అరోరా.. బుమ్రా బౌలింగ్ లో భారీ నో-లుక్ సిక్స్ కొట్టాడు. డీప్ స్క్వేర్ లెగ్ పైకి కొట్టి బంతి ఎక్కడికి వెళ్తుందో చూడకుండానే షాట్ పూర్తి చేశాడు సలీల్ అరోరా. పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చెందిన సలీల్ అరోరా 2002 నవంబర్ 7న జన్మించాడు. అతడి తండ్రి రాకేష్ అరోరాకు ఓ చిన్న వ్యాపారం ఉంది. ఆయన కూడా ఓ మాజీ క్రికెటర్. ఆయన జిల్లా స్థాయిలో క్రికెట్ ఆడారు. అయితే.. కుటుంబ బాధ్యతల కారణంగా ఆయన మధ్యలోనే క్రికెట్‌ను వదిలి వ్యాపారంలోకి ప్రవేశించారు. అయినప్పటికీ ఆయనలోని క్రికెటర్ మాత్రం సజీవంగానే ఉన్నారు. అందుకే.. సలీల్ పుట్టినప్పుడు, తన కొడుకును ఒక క్రికెటర్‌గా చేయాలని నిర్ణయించుకున్నాడు. 23 ఏళ్ల సలీల్ తన తండ్రి కలను నెరవేరుస్తున్నాడు. గత సంవత్సరం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో కేవలం 39 బంతుల్లోనే సెంచరీ చేసి సంచలనం సృష్టించడంతో సలీల్ తొలిసారిగా వెలుగులోకి వచ్చాడు. ఆ మ్యాచ్‌లో సలీల్ 45 బంతుల్లో 11 సిక్సర్లు, 9 ఫోర్లతో సహా 125 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ఐపీఎల్ 2026లో సలీల్‌ను 30 లక్షల కనీస ధరతో వేలంలోకి రాగా.. చివరికి సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.1.50 కోట్లకు కొనుగోలు చేసింది.

# బుమ్రా కూడా మనిషే.. మరమనిషి కాదు



ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్ పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఆ జట్టు మేనేజ్‌మెంట్ అండగా నిలిచింది. బుమ్రా కూడా మనిషేనని, ఫామ్ కోల్పోవడం సహజమేనని ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్ అన్నాడు. అతనికి ముంబై ఇండియన్స్ అండగా ఉంటుందని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బుమ్రా దారుణంగా విఫలమయ్యాడు. 4 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క వికెట్ తీయకుండా 54 పరుగులు సమర్పించుకున్నాడు. ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా రెండు వికెట్లు మాత్రమే తీసాడు. బుమ్రా ఐపీఎల్ కెరీర్‌లోనే ఈ సీజన్ అతనికి వరస్ట్‌గా మారిపోయింది. దాంతో అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న కీరన్ పొలార్డ్.. బుమ్రా వైఫల్యం గురించి మాట్లాడాడు. 'ఏ ఆటగాడైనా సరైన ప్రదర్శన చేయలేకపోతే.. వెంటనే ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా పరిశీలిస్తుంటాం. సదరు ఆటగాడు ఎందుకు ఆడలేకపోతున్నాడనే దానిపై చర్చలు పెడుతుంటాం. ఇలాంటి వాటి నుంచి జస్‌ప్రీత్ బుమ్రా మినహాయింపేమీ కాదు. గత కొన్నేళ్లుగా అతను ఎలాంటి ప్రదర్శన కనబర్చాడో మనం చూశాం. బుమ్రా కూడా మనిషే కదా.. అతను కూడా తప్పులు చేస్తాడు. కాలం కలిసి రానప్పుడు గతంలో చేసిన మంచిని గుర్తు చేసుకోవాలి. బుమ్రా తన స్థాయికి తగ్గట్లు రాణించ లేకపోయాడు. అయినా.. ఇప్పటికీ అతను వరల్డ్ నంబర్‌వన్ బౌలర్. అలానే మా ముంబై ఇండియన్స్‌కు కీలక బౌలర్.

# రియాన్ పరాగ్ కు భారీ షాకిచ్చిన బీసీసీఐ!



రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ సిగరెట్ వివాదాన్ని బీసీసీఐ తీవ్రంగా పరిగణిం చింది. అతడి మ్యాచ్? ఫీజులో 25శాతం కోత విధిస్తున్నట్లు పేర్కొంది. అలాగే పరాగ్ ఖాతాలో 1 డీమెరిట్ పాయింట్ కూడా చేర్చినట్లు తెలిపింది. ఈ మేరకు ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. పరాగ్ ఐపీఎల్ నిబంధనలు ఉల్లఘించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.'పంజాబ్ కింగ్స్?తో మ్యాచ్?లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి కోడ్? 2.21ను రియాన్ పరాగ్ ఉల్లంఘించాడు. దీనిని లెవెల్ 1 తప్పిదంగా భావిస్తూ అతడి మ్యాచ్? ఫీజులో 25 శాతం కోత విధిస్తూ, 1 డీమెరిట్ పాయింట్ చేర్చుతున్నాం' అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ పేర్కొంది. పరాగ్ కూడా? తన తప్పును అంగీకరించినట్లు తెలిసింది. అలాగే మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ విధించిన ఫైన్?ను స్వీకరించాడు. కాగా, ఇటీవల ముల్లాన్?పుర్ వేదికగా పంజాబ్ కింగ్స్?తో జరిగిన మ్యాచ్?లో రియాన్ పరాగ్ చేసిన పని వివాదాస్పదం అయ్యింది. ఈ మ్యాచ్ సెకండ్ ఇన్నింగ్స్ 16వ ఓవర్లో డ్రెస్సింగ్ రూమ్?లో కూర్చొని ఉన్న పరాగ్ ఈ సిగరెట్ (ఎలక్ట్రిక్ సిగరెట్) తాగుతూ కనిపించాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. దీనిపై పెద్ద దుమారమే రేగింది. డ్రెస్సింగ్ రూమ్?లో అలాంటి పనులు చేయడంపై నెటిజన్లు సైతం పరాగ్?పై మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని సీరియస్?గా తీసుకున్న బోర్డు ఈ మేరకు చర్యలు చేపట్టింది. అయితే భారత్?లో ఈ సిగరెట్ల వాడకంపై నిషేధం ఉంది. వీటిని కేంద్ర ప్రభుత్వం 2019లోనే బ్యాన్ చేసింది. ఎలక్ట్రిక్ సిగరెట్లు, ఆ పరికరాల ఉత్పత్తి, అమ్మకం, కొనుగోలు, వాడకాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దీంతో పరాగ్?పై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఈ నిబంధన ఉల్లంఘిస్తే ఎవరైనా సరే 'ప్రొహిబిషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ సిగరెట్స్ యాక్ట్ (రాజుజూ) 2019' ప్రకారం రూ. లక్ష జరిమానాతోపాటు, జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే దీనిపై రాజస్థాన్ మేనేజ్?మెంట్ నుంచి మాత్రం ఎలాంటి ప్రకటన రాలేదు. ఈ ఐపీఎల్?లో పరాగ్ పేలవంగా ఆడుతున్నాడు. ఇప్పటిదాకా ఈ సీజన్?లో పరాగ్? నుంచి భారీ ఇన్నింగ్స్ రాలేదు. ఇటీవల పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో పరాగ్ 16 బంతుల్లో 29 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్?కు చేరాడు. ఈ సీజన్?లో పరాగ్?కు అత్యధిక స్కోర్ ఇదే.




# ఓటిటిలోకి బైకర్ విడుదల



టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'బైకర్' ఓటీటీలోకి రాబోతుంది. భారతదేశంలోనే మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం మే 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది. ఇక హిందీలో ఈ సినిమాను 'శర్వా' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్ తన కెరీర్‌లో ఎదుర్కొనే సవాళ్లు, తండ్రి ఆశయాల కోసం అతను చేసే పోరాటాన్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు.

# భోగిలో...కందుల సులోచనగా అనుపమ




టాలీవుడ్ నటుడు శర్వానంద్ కథానాయకుడిగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' . ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా తాజాగా ఈ సినిమా నుంచి కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో అనుపమ కందుల సులోచనా రాణి అనే గ్రామీణ యువతిగా కనిపించబోతుంది. చేతిలో క్యారేజీ, మోదుగ ఆకులు పట్టుకుని ఉన్న పోస్టర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఈ సినిమా సాగబోతున్నట్లు సమాచారం. సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న ఈ హై-వోల్టేజ్ డ్రామాలో శర్వానంద్ ఊరమాస్ అవతారంలో కనిపిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరియు డింపుల్ హయాతీ ఫీమేల్ లీడ్స్ గా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 28, 2026 న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.



# మెడికల్ మాఫియా బాగోతంపై దూత-2


ఓటీటీ ప్రపంచంలో డార్క్, రియలిస్టిక్ కథనాలకు పెరుగుతున్న ఆదరణ మధ్య దూత సీజన్ 2పై ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. మొదటి సీజన్ జర్నలిజం బ్యాక్‌డ్రాప్‌లో సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా ఈ సిరీస్, ఇప్పుడు పూర్తిగా కొత్త జానర్ వైపు మలుపు తిరగడం హాట్ టాపిక్‌గా మారింది. ఈసారి మేకర్స్ మెడికల్ మాఫియా వంటి సున్నితమైన అంశాన్ని ఎంచుకోవడం విశేషం. ఆరోగ్య రంగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, మాఫియా నెట్వర్క్‌ను రియలిస్టిక్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. దీంతో సిరీస్ మరింత డార్క్, గ్రిప్పింగ్ నేరేషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉంది. ఈ మార్పు వెనుక ప్రధాన బలం దర్శకుడు విక్రమ్ కె. కుమార్ విజన్ అని చెప్పాలి. థ్రిల్లర్ కథనాల్లో తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్న ఆయన, సీజన్ 1లో జర్నలిజం ప్రపంచంలోని అంధకార కోణాలను చూపించినట్లే, ఈసారి మెడికల్ రంగంలోని లోపాలను షాకింగ్ ఎలిమెంట్స్‌తో తెరపైకి తీసుకురానున్నారు. ప్రస్తుతం ఓటిటి ప్లాట్‌ఫార్మ్‌లలో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్‌కు భారీ డిమాండ్ ఉంది. రియలిస్టిక్, డార్క్ కంటెంట్‌కు ప్రేక్షకులు ఎక్కువగా ఆకర్షితులవుతున్న నేపథ్యంలో, 'దూత 2' కూడా అదే ట్రెండ్‌ను క్యాష్ చేసుకునేలా రూపొందుతోంది. 'దూత' మొదటి సీజన్ మంచి రెస్పాన్స్ అందుకోవడంతో, రెండో సీజన్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి.

# అగధలో మంజుల మనవరాలు జోవిక

ప్రముఖ సీనియర్ దర్శక నిర్మాత ఎమ్మెస్ రాజు ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న మిస్టికల్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. హారర్ జానర్‌లో రాబోతున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమా ద్వారా తమిళ నటి వనితా విజయ్ కుమార్ కుమార్తె,అలనాటి మంజుల మనవరాలు జోవిక విజయ్ కుమార్ టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. చిత్రంలో ఆమె 'హరిణి' అనే పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఆమెను ఒక తీవ్రమైన శక్తిగా అభివర్ణించారు మేకర్స్. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బాలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రావణ్ రెడ్డి 'సింహ'గా, కామాక్షి భాస్కర్ల 'మహాదేవి'గా నటిస్తుండగా, ఉల్కా గుప్తా, షిజు అబ్దుల్ రషీద్ వంటి తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు సుమారు 45 నిమిషాల పాటు సాగే భారీ వీఎఫ్ఎక్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతాన్ని అందిస్తుండగా, నాని చమిడిశెట్టి ఛాయాగ్రహణం, జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ మరియు రాజీవ్ నాయర్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



# ప్రళయ్ మూవీ పనుల్లో రణ్‌వీర్ బిజీ



'ధురంధర్ 2' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు నటుడు రణ్‌వీర్ సింగ్. ఈ సినిమా హిట్ తర్వాత గతంలో అంగీకరించిన కొన్ని సినిమాల నుంచి ఆయన వైదొలుగుతున్నారంటూ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ప్రళయ్' టీమ్ స్పందించింది. ఆయన ఈ సినిమా నుంచి వైదొలగలేదని స్పష్టం చేసింది.రణ్‌వీర్ సింగ్ హీరోగా జై మెహతా తెరకెక్కిస్తున్న చిత్రమిది. వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు కూడా ఇటీవల ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో టీమ్ స్పందిస్తూ.. 'రణ్‌వీర్, జై ఇద్దరూ 'ప్రళయ్' సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. నిరంతరం చర్చలు జరుపుతూ స్క్రిప్ట్‌ను లాక్ చేశారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. భారతీయ సినిమాలో ఇప్పటివరకు చూడని ఓ భారీ అద్భుతాన్ని తెరపై ఆవిష్కరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ఇక 'ప్రళయ్' విషయానికి వస్తే.. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత హన్సల్ మెహతా కుమారుడు జై మెహతా ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గతంలో ఆయన 'స్కామ్ 1992', 'లూటేరే' వంటి వెబ్‌సిరీస్‌లకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు.